క్లుప్తంగా

సేఫ్టీ కోర్సులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సురేష్

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్(గైస్)లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సేఫ్టీ కోర్సుల ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అమర్‌రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్(తిరుపతి) సేఫ్టీ డిపార్ట్‌మెంట్ హెడ్ ఆర్‌ఎస్‌ఎన్‌ఆర్ సురేష్ పాల్గొని విద్యార్థులకు సేఫ్టీ విభాగంలోని పలు అంశాలను వివరించారు. విపత్తుల గుర్తింపు, వాటి నివారణ మార్గాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సేఫ్టీ విభాగం సీనియర్ మేనేజర్ మాధవ్‌కుమార్, కాలేజీ సేఫ్టీ కోర్సుల కో ఆర్డినేటర్ వరహాలు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్త



సీతంపేట మెయిన్ రోడ్డులో డంపర్ బిన్ వద్ద చెత్త కుప్ప

సీతమ్మధార: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట మెయిన్ రోడ్డులో ఎక్కడ చూస్తే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పట్టించుకోక పోవడంతో డంపర్ బిన్లు చెత్తతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపర్ బిన్లు రోడ్డుపైకి రావడంతో రాత్రిపూట వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. చెత్త నుంచి వస్తున్న దుర్వాసన వల్ల ముక్కు మూసుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోందని పాదచారులు వాపోతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య అధికారులు దృష్టి సారించి చెత్త పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

అంధులకు అన్నదానం

దాబాగార్డెన్స్: అంధులకు సేవ చేయడంలో తృప్తి ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ అన్నారు. స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు అంధులకు అన్నదానం చేశారు. అనంతరం ఒక్కొక్కరికి 5 కేజీలు చొప్పున బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల వారిని గుర్తించి మనం ఆదుకోవాలని అన్నారు. వారికి సేవలందించడమే కాక అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతమ్మధార: విశాఖ ఆర్థిక రాజధానిగా అభివృద్ధి సాధిస్తుందని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సీతంపేట దరి రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయం సాధిస్తాడని ధీమా వ్యక్తం చేశారు. దక్షిణలో రైతు బజారు ఏర్పాటుకు కృషి చేస్తామని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. సినీ దర్శకుడు మెహర్ రమేష్ మాట్లాడుతూ ముంబై, చెన్నై మాదిరిగా సముద్రం ఉన్న విశాఖలో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని, కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని పేర్కొన్నారు. కార్పొరేటర్లు భీశెట్టి వసంతలక్ష్మి, సాధిక్, జనసేన ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, సీనియర్ నాయకుడు శివప్రసాద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.ఉమామహేశ్వరరావు, బీజేపీనాయకుడు జి.అప్పారావు పాల్గొన్నారు.

పచ్చదనానికి మార్కు.. హరిత పార్కు

- దాతల సహకారంతో ఉద్యానవనం అభివృద్ధి
- మరిన్ని సౌకర్యాల కల్పనకు జీవీఎంసీ సహకరించాలి
- పార్కు నిర్వహణ కమిటీ సభ్యుల విజ్ఞప్తి



హరిత పార్కు గేటు దుస్థితి



మురళీనగర్ హరిత పార్కులో మట్టితో కొత్తగా నిర్మించిన వాకింగ్ ట్రాక్

మురళీనగర్: మురళీనగర్ సెక్టార్–8లోని హరిత పార్కు పేరుకు తగ్గట్టుగానే హరితమయంగా కనిపిస్తుంది. గతంలో జీవీఎంసీతోపాటు స్థానిక దాతల సహకారంతో హరిత పార్కును నిర్వహణ కమిటీ సభ్యులు అభివృద్ధి చేశారు. దీంతో పార్కు ఆహ్లాదకరంగా సందర్శకులను ఆకర్షించేలా రూపొందింది. ప్రస్తుతం కొన్ని అదనపు సౌకర్యాలు కల్పిస్తే పార్కును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్థానికులు, నిర్వహణ కమిటీ సభ్యులు చెబుతున్నారు.

పచ్చదనం పరవళ్లు..

25 ఏళ్ల కిందట మురళీనగర్ సెక్టార్–8లో ఎగువ కొండను ఆనుకుని హరిత పార్కును నిర్మించారు. దాతల సహకారంతో దీన్ని మొదట్లో అభివృద్ధి చేశారు. అనంతరం పార్కును పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు జీవీఎంసీ నిధులు మంజూరు చేసింది. గ్రీనరీ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. స్టేజీ, కార్యాలయ భవనాన్ని తిప్పారెడ్డి, కొండలరావు, మురళీ, బద్రిరాజు, ఇతర వాకర్స్, దాతల సహకారంతో సమావేశ మందిరాన్ని నిర్మించారు. అప్పట్లో సుమారు రూ.5 లక్షలు ఖర్చు చేశారు. దాతల సహకారంతో పార్కు పచ్చదనాన్ని అభివృద్ధి చేశారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ సహకారంతో రూ.19 లక్షలతో ఇటీవల అభివృద్ధి పనులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆధునికమైన మట్టి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటులో భాగంగా అదనపు పరికరాలు, గర్ప్ వాల్స్ నిర్మించారు. వాకింగ్ ట్రాక్‌ను వెడల్పు చేయడంతో కొత్త అందాన్ని సంతరించుకుంది.

ఇవీ సమస్యలు..

చూడముచ్చటగా కనిపిస్తున్న ఈ పార్కులో వరద నీటి తాకిడి ప్రధాన సమస్యగా మారింది. గతంలో ఎగువ కొండ నీటి ప్రవాహంతో ఇక్కడి ప్రహరీ గోడ కూలి పార్కును ముంచెత్తింది. ప్రస్తుతం వర్షాల ప్రభావంతో నీటి ప్రవాహం వల్ల వాకింగ్ ట్రాక్ పాడవుతోంది. దీని నివారణకు అత్యవసరంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంది. వాచ్‌మన్ గది శిథిలావస్థకు చేరింది. దీన్ని తక్షణం నిర్మించాల్సి ఉంది. సందర్శకులు, వాకర్స్‌కు టాయిలెట్స్, తాగునీటి సదుపాయం లేదు. పార్కు గేటు పూర్తిగా పాడైంది. గేటుతోపాటు ఆర్చి నిర్మాణం చేపట్టి ప్రహరీకి రంగులు వేయాలి. పిల్లల ఆటస్థలం అభివృద్ధి, ఆటపరికరాల ఏర్పాటు, గార్డెనింగ్ విద్యుద్దీపాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల ఏర్పాటు, కృష్ణుడు, బుద్ధుడి విగ్రహాలపై షెల్టర్ నిర్మించాల్సి ఉంది. ఈ సమస్యలన్నీ పరిష్కరించి, హరిత పార్కు అభివృద్ధికి సహకరించాలని జీవీఎంసీ అధికారులను నిర్వహణ కమిటీ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.



పార్కులో శ్రీకృష్ణుడి విగ్రహం



కొత్త వాకింగ్ ట్రాక్‌పై నడుస్తున్న వాకర్స్

జీవీఎంసీ సహకరించాలి



హరిత పార్కును దాతలు, కార్యవర్గ సభ్యుల సంపూర్ణ సహకారంతో అభివృద్ధి చేయగలిగాం. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ వి.ప్రసాద్‌ల సహకారంతో ఒక రూపానికి తెచ్చాం. ప్రస్తుతం వర్షాల్లో పార్కుకు సరైన రక్షణ కరువైంది. ఇందుకు అవసరమైన పనుల నిర్వహణకు జీవీఎంసీ సహకరించి నిధులు మంజూరు చేయాలి.

– పిల్లా కొండలరావు, అధ్యక్షుడు, హరిత పార్కు నిర్వహణ కమిటీ

డ్రైనేజీ ఏర్పాటు చేయాలి



పార్కులో అత్యవసరంగా నీటి నిల్వలను అరికట్టేందుకు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ఇందుకు జీవీఎంసీ సహకరించాలి. పిల్లలు, పెద్దలకు రానున్న కాలంలో వివిధ అంశాల్లో పోటీల నిర్వహణకు ప్రణాళిక తయారు చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ పార్కు పరిశుభ్రతకు సహకరించాలి.

– డి.దేముడు, కార్యదర్శి, నిర్వహణ కమిటీ

ప్రశాంత వాతావరణం



హరిత పార్కులో ప్రశాంతమైన వాతావరణంలో ఆరోగ్యాన్ని రెట్టింపు చేసుకోవచ్చు. కొండ దిగువన ఉండటం వల్ల స్వచ్ఛమైన గాలి, పచ్చని పరిసరాల్లో సేదతీరవచ్చు. ఇంతటి చక్కని వాతావరణం కల్పించడానికి జీవీఎంసీ నిధులను మంజూరు చేయించిన కె.కె.రాజు, వావిలపల్లి ప్రసాద్‌ల కృషిని ఎప్పటికీ మర్చిపోలేం.

– ఎ.వి.ఎస్.రాజు, గౌరవాధ్యక్షుడు, నిర్వహణ కమిటీ

ప్రతిభకు ప్రోత్సాహం అభినందనీయం



కళాకారులకు పురస్కారాలు అందిస్తున్న అతిథులు

సీతమ్మధార: తెలుగు రాష్ట్రాల్లో వేర్వేరు రంగాలకు చెందిన 39 మంది ప్రతిభావంతులను గుర్తించి వారికి పురస్కారాలు అందజేయడం అభినందనీయమని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రతిభ, క్రీడా, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు కళాకారులకు అతిథుల చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు స్వీకరించిన ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో మరింతగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. రెండు దశాబ్దాలకు పైగా క్రమం తప్పకుండా పురస్కారాలు అందిస్తున్న నిర్వాహకుడు అడవిరాజును అతిథులు ప్రశంసించారు. లక్ష్మీస్వరూప వ్యాఖ్యానం చేసిన సభలో చెన్నా తిరుమలరావు, సత్యప్రసాద్ శర్మ, నాంచారయ్య, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే గిరిజన సమస్యలకు పరిష్కారం

ఎంవీపీకాలనీ: ఐక్యతతోనే గిరిజనుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. ప్రపంచ ఆదివాసీ హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ గిరిజన భవన్‌లో ఆదివారం ప్రారంభించిన వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయపరంగా గిరిజనులు ఘననీయమైన వృద్ధి సాధించాల్సి ఉందన్నారు. దేశంలో అత్యంత వెనుకబడిన వారుగా గిరిజనులు నిలుస్తున్నారన్నారు. గిరిజనుల కోసం రాజ్యాంగంలో రూపొందించిన చట్టాల అమలులో నేటికీ వివక్ష కొనసాగుతోందన్నారు. ఈ నేపథ్యంలో చట్టాల పరిరక్షణ, అమలుకు అన్ని గిరిజన సంఘాలు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే శిరీషాదేవిని నిర్వాహకులు సత్కరించారు. ఈ నెల 15 వరకు వారోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన యువతీ యువకులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఉత్సాహంగా జిల్లా స్థాయి నడక పోటీలు



నడక పోటీలను ప్రారంభిస్తున్న డిస్ట్రిక్ట్–101 గవర్నర్ రంగారావు, త్రీస్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రాంబాబు

కంచరపాలెం: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీస్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వి.రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి నడక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులు డిస్ట్రిక్ట్–101 గవర్నర్ టి.రంగారావు, ఫౌండర్ సూర్యనారాయణ జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ నడకతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం నడకకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. జిల్లా స్థాయిలో 4 కేటగిరీల్లో 135 మంది మహిళలు, పురుషులు నడక పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు ఆగస్టు 15న జరిగే వేడుకల్లో బహుమతులు అందజేస్తామని కార్యదర్శి బలరామ్ తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి వెంకటరావు, జాయింట్ కార్యదర్శి ఇమ్మానియేల్, జాలీ వాకర్ రవీంద్ర బెహరా, బులెటిన్ ఎడిటర్ సత్యనారాయణ, డిప్యూటీ గవర్నర్ అప్పలనాయుడు, మాజీ అధ్యక్షులు, మాజీ గవర్నర్లు ఆర్.ఆర్.మహేశ్వరరావు, టి.రాజు, సుకుమార్, సూర్యారావు, నూకరాజు, వాక్యత ఆడబాల సత్యనారాయణ, మాధవధార, మురళీనగర్, సింహాచలం, ఆర్టీసీ కాంప్లెక్స్, ఎంవీపీ ప్రాంతాల నుంచి వాకర్లు పాల్గొన్నారు.

కలిసి నడుద్దాం.. ఆరోగ్యంగా ఉందాం



మాట్లాడుతున్న వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ సీలం ఐజాక్



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు

మురళీనగర్: వాకర్స్ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరం కలిసి నడుద్దామని వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ సీలం ఐజాక్ పిలుపునిచ్చారు. వాకర్స్ డిస్ట్రిక్ట్–101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్–101 పరిధిలోని వాకర్స్ క్లబ్‌ల ప్రధాన బాధ్యులతో మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కు వనితా భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనలో భాగంగా నడక ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వాకర్స్ క్లబ్ సభ్యులకు గురుతర బాధ్యత ఉందన్నారు. వాకర్స్ చెల్లించే సభ్యత్వ రుసుమును సేవా కార్యక్రమాలకే ఉపయోగిస్తున్నామని చెప్పారు. మహాత్మా గాంధీ ఫెలోషిప్ సభ్యత్వాలను వీలైనంత ఎక్కువగా సేకరించాలన్నారు. మరో ముఖ్య అతిథి రాళ్లపల్లి సత్యనాథం మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ కార్యవర్గ ప్రతినిధులు తమ క్లబ్‌లోని సభ్యులను సమన్వయపరిచి సేవా కార్యక్రమాలను విస్తృత పరచాలని సూచించారు. డిస్ట్రిక్ట్–101 గవర్నర్ టి.రంగారావు, పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభతోపాటు విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 55 మంది వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డిస్ట్రిక్ట్–101 కేబినెట్ ఇదే..

డిస్ట్రిక్ట్–101 క్యాబినెట్ కార్యవర్గ ప్రధాన బాధ్యులను ద్వారకానాథ్ నామినేట్ చేశారు. కేబినెట్ కార్యదర్శిగా ఆర్‌ఆర్‌ఎస్ మహేష్(త్రీస్టార్ వాకర్స్ క్లబ్), సంయుక్త కార్యదర్శిగా ఆర్.నాగేశ్వరరావు(మురళీనగర్ వాకర్స్ క్లబ్), నిర్వహణ కార్యదర్శిగా చొల్లంగి ప్రసాద్(మురళీనగర్ వాకర్స్ క్లబ్), కోశాధికారిగా డి.లక్ష్మణరావు (హెల్దీ వాకర్స్ క్లబ్), సంయుక్త కోశాధికారిగా కె.వినీల(మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్), వాక్‌టాక్ మ్యాగజైన్ ఎడిటర్‌గా డి.శిరీష (మాధవదార మహిళా వాకర్స్ క్లబ్), పీఆర్‌వోగా సిహెచ్.ప్రసాద్ (మురళీనగర్ వాకర్స్ క్లబ్), ముఖ్య సలహాదారులుగా కె.మాధవి(మాధవదార మహిళా వాకర్స్ క్లబ్), సిహెచ్.విజయ ప్రసాద్(హెల్దీ వాకర్స్ క్లబ్), డిప్యూటీ గవర్నర్లుగా మురళీనగర్ వాకర్స్ క్లబ్‌ల నుంచి వి.జె.ప్రభాశర్మ, జె.ఉమాదేవి, పల్లా చంద్రమౌళి, పీఎంపాలెం నుంచి పి.జ్యోతీకమలను నామినేట్ చేసి కార్యవర్గాన్ని ప్రకటించారు. వీరందరూ 2025 సంవత్సరానికి ఎలక్ట్ గవర్నర్ ద్వారకానాథ్‌తో కలిసి పనిచేస్తారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులను సత్కరించారు.



• వ్యర్థాలనూ వదలడం లేదు...

జ్ఞానాపురంలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ దగ్గర కనిపించిన ఈ దృశ్యాలు చూస్తే.. చెత్త నుంచి సంపద సృష్టి ఇలానా.. అని అనక మానరేమో! హోల్‌సేల్ వ్యాపారం జరిగిన తర్వాత కుళ్లిపోయిన.. పాడైన కూరగాయలు, ఆకుకూరలు బయట ఉన్న ఫ్లైఓవర్ కింద పారబోస్తారు. వాటిని చుట్టుపక్కల ఉన్న పశువులు తినేందుకు వస్తాయి. అయితే.. కొందరు వచ్చి ఆ మూగ జీవాలను అక్కడి నుంచి తరిమేసి.. అందులో కాస్త శుభ్రంగా ఉన్న కూరగాయలను వేరు చేస్తున్నారు. వాటిని శుభ్రంగా కడిగి కుళ్లిపోయిన భాగాన్ని కోసి.. హోటళ్లు, రెస్టారెంట్లకు విక్రయించేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పశువుల నోటికాడ కూడుని లాగేసుకుంటున్నారు.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



14న మిగులు సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

సబ్బవరం: అనకాపల్లి, విశాఖ జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలోని 3, అనకాపల్లి జిల్లా పరిధిలోని 5 గురుకులాల్లో 5వ తరగతితో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 14న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

5వ తరగతి ప్రవేశం కోసం 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం పదో తరగతి ఉత్తీర్ణత పత్రం, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని గురుకులంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 0891–2799641 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అంబేడ్కర్ మహాశిల్పంపై దాడి దారుణం



మాట్లాడుతున్న కొత్తపల్లి వెంకటరమణ

సీతమ్మధార: విజయవాడలో చరిత్రాత్మకంగా నెలకొల్పిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మహాశిల్పంపై పలువురు దాడి చేయడాన్ని నవయానం బహుజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ తీవ్రంగా ఖండించారు. బుల్లయ్య కళాశాల దరి అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘటన జరిగి మూడు రోజులవుతున్నా.. దుండగులను అరెస్టు చేయలేదంటే అనేక అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు. విజయవాడ నగరం నడిబొడ్డున అంబేడ్కర్ మహాశిల్పం పక్కనే పోలీస్ కమిషనరేట్, గవర్నర్ బంగ్లా, కలెక్టర్ కార్యాలయం ఉన్నప్పటికీ విగ్రహానికి రక్షణ కల్పించలేని దారుణమైన స్థితి రాష్ట్రంలో ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు కలిగిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం గానే ఈచర్యను చూడలేమని, రాజ్యాంగ నిర్మాతపై ఇదో దాడిగా భావించాలన్నారు. అంబేడ్కర్ మహాశిల్పాన్ని గత సీఎం జగన్ ఆవిష్కరించిన నేపథ్యంలో ఆయన పేరును అక్కడ పేర్కొన్నారని, అంతమాత్రాన ఇలాంటి చర్య తగదన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పెద్దలు ఈ చర్యను ఖండించకపోవడం దారుణమని మండిపడ్డారు. అంబేడ్కర్ శిల్పంతోపాటు లైబ్రరీ, పార్కు సదుపాయాలు అక్కడ ఉన్నాయని, ఇదో చారిత్రక ప్రదేశంగా, విజ్ఞాన కేంద్రంగా మారిందని తెలిపారు. దళిత మహిళ హోం మంత్రిగా ఉన్న ఈ రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగడం అభ్యంతరకరమని, దుండగులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ధర్మారావు, జాయింట్ సెక్రటరీ ఎస్.ఎ.రావు, సభ్యులు ఆర్.ఎస్.నారాయణ, ఎస్.నూకరాజు, వై.నూకరాజు, ఎం.అప్పారావు, పెయ్యల సిద్ధార్థ పాల్గొన్నారు.

జూలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం చిత్రలేఖనం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ నెల 12న అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూ బయోస్కోప్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభించిన పోటీల్లో నగరంలోని ప్రభుత్వ పాఠశాలలతోపాటు వివిధ స్కూళ్లకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారి ప్రతిభకు పదును పెట్టి ఏనుగులు, పర్యావరణానికి సంబంధించిన చిత్రాలు వేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ ఏనుగులపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పిల్లలను పోటీలకు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.


రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ రమేష్



ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ వెంకటరావు



రౌడీషీటర్లతో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఐదో పట్టణ సీఐ భాస్కరరావు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్ల వ్యవహారంపై కొత్త పోలీస్ కమిషనర్ చాలా సీరియస్‌గా ఉన్నారన్నారు. రౌడీషీటర్లు హద్దు మీరితే సీపీ వెంటనే స్పందించి నగర బహిష్కరణ చేస్తారని హెచ్చరించారు. గతంలో కూడా కొందరు రౌడీషీటర్లను గత సీపీలు నగరం నుంచి బహిష్కరించారని గుర్తు చేశారు. సమాజంలో అల్లర్లు, తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు సీఐ రమేష్ సూచించారు.

● ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఎస్‌ఐ జి.వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. సమాజంలో ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల దినచర్యపై ఆరా తీశారు.

హద్దు మీరితే చర్యలు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.భాస్కరరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా హద్దు మీరి ప్రవర్తించినా, ఎటువంటి నేరాలకు పాల్పడినా చర్యలు తప్పవని రౌడీషీటర్లను ఆయన హెచ్చరించారు. ఎలాంటి గొడవలు, కొట్లాటల జోలికి పోకుండా అందరూ సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.